గద్వాలలో రథంపై ఊరేగుతున్న చెన్నకేశవుడు

మల్దకల్‌లో శమీ వృక్షం వద్ద పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వనపర్తి మినీ ట్యాంక్ బండ్ వద్ద శమీ పూజలు నిర్వహిస్తున్న సంస్థానాధీశులు, ప్రజాప్రతినిధులు


గద్వాల చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

ఘనంగా దసరా వేడుకలు

- వేడుకల్లో పాల్గొన్న వనపర్తి సంస్థానాధీశులు, ప్రజాప్రతినిధులు
- శమీ పత్రాలు ఇచ్చిపుచ్చుకొని శుభాకాంక్షలు తెలుపుకొన్న ప్రజలు

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక నిర్వహించుకునే విజయదశమి పండుగను జోగుళాంబ గద్వాల , వనపర్తి జిల్లాల్లో ఆయా మండల కేంద్రాలతోపాటు అన్ని గ్రామాల్లో శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. మహిళలు వేకువ జామున స్నానాలు ఆచరించి పిండి వంటలు తయారు చేసి దేవుడికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. స్థానికంగా ఉండే ఆలయాలను భక్తులు పెద్దఎత్తున దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. విజయ దశమి సందర్భంగా శమీ వృక్షాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఒకరి నొకరు శమీని ఇచ్చుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పలు వీధులు, ఆలయాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి పదో రోజు శోభాయాత్రలు నిర్వహించి స్థానికంగా ఉండే నదులు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన శోభా యాత్రలో మహిళలు, భక్తులు కోలాటాలు వేసుకుంటూ, నృత్యాలు చేస్తూ ముందుకు సాగారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని వనపర్తి జిల్లా కేంద్రంలో సంస్థానాధీశులు రాజాకృష్ణదేవరావు తన కుటుంబ సభ్యులతో కలిసి కోటలో ఉదయం అమ్మవారికి సాంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించారు. ఈ పూజ వేడుకల్లో ఎమ్మెల్యే మేఘారెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారిని పల్లకీసేవలో కోట నుంచి మినీ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న శమీ వృక్షం వరకు ఊరేగింపు వెళ్లగా అక్కడ వేదపండితుల చేత శమీ పూజలు నిర్వహించారు. ఈ పూజలను తిలకించేందుకు పట్టణ ప్రజలంతా మినీ ట్యాంక్‌బండ్‌పై వేలాదిగా తరలివచ్చారు. గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి శనివారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని గుంటి చెన్నకేశవ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. విజయదశమిని పురస్కరించుకొని ఖిల్లా ఘణపురం, ఆత్మకూరు మండల కేంద్రాల్లో రావణ దహనకాండను నిర్వహించారు. పెబ్బేరులో హిందూ జాగృతం ఆధ్వర్యంలో సంత బజారులో ఏర్పాటు చేసిన రావణాసురుడి దిష్టి బొమ్మను దహనం చేశారు. ఆత్మకూరు పట్టణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ గాయత్రి రవికుమార్‌యాదవ్ దంపతులు శమీపూజను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా సిద్ధం చేసిన రావణాసురుడి బొమ్మను దహనం చేశారు. అలాగే గద్వాల కోటలో వెలిసిన భూ లక్ష్మీచెన్నకేశవుడిని శనివారం రాత్రి ప్రత్యేక పల్లకీలో గుండు చెన్నకేశవ స్వామి ఆలయం వరకు ఊరేగించారు. అలాగే గుండు చెన్నకేశవ స్వామి ఆలయంలోని శమీవృక్షానికి ప్రత్యేక పూజలు నిర్వహించి శమీని ఒకరికొకరు పంచుకుంటూ దసరా శుభాకాంక్షలు చెప్పుకున్నారు. మల్దకల్ మండల కేంద్రంలోని స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలోని శమీ వృక్షానికి ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే స్వామివారి ఉత్సహ విగ్రహాలను పల్లకీలో దేవర గట్టుకు ఊరేగింపుగా వెళ్లి అనంతరం గ్రామంలోని దశమి కట్ట వద్దకు వరకు ఊరేగించారు. పెద్ద చింతరేవులలో అర్చకులు స్వామివారిని ఆలయం నుంచి శమీ వృక్షం వరకు భాజా భజంత్రీలతో పల్లకీలో ఊరేగించారు. కేటీదొడ్డి మండలంలోని వెంకటాపురంలో వెలిసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివార్లను ఊరేగించారు. ఆలయానికి భక్తులు పోటెత్తారు. పలువురు కర్ణాటక భక్తులు పాద యాత్ర చేసుకుంటూ ఆలయానికి చేరుకున్నారు. పాన్‌గల్ మండలంలోని కేతేపల్లిలో డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజలు శమీ వృక్షం వద్ద దుర్గామాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గద్వాల మండలంలోని పూడూరు గ్రామంలోని ఆలయంలో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పూజలు నిర్వహించి శోభా యాత్రను ప్రారంభించారు. అయిజ పట్టణానికి సమీపంలోని స్వయంభూ కట్ట కింద తిమ్మప్ప వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో స్వామివారికి రథోత్సవం నిర్వహించారు. కట్టకింద తిమ్మప్పస్వామి ఆలయంలో బక్కని నర్సింహులు ప్రత్యేక పూజలు నిర్వహించి, శమీ వృక్షానికి పూజలు నిర్వహించారు. ఆలయానికి టీటీడీ ద్వారా నిధుల మంజూరుకు కృషి చేస్తామని నర్సింహులు ఆలయ కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. అలాగే మండలంలోని రాజాపురం గ్రామంలోని గుంటి రంగనాథస్వామి ఆలయంలో గుంటి రంగనాథుడు శ్రీదేవి, భూదేవిలతో కలిసి పల్లకిలో ఊరేగారు. అలాగే తెలంగాణ సరిహద్దులోని కర్ణాటక రాష్ట్రం, రాయిచూరు నియోజకవర్గం, గణదళంలో వెలిసిన పంచముఖ ఆంజనేయస్వామికి రథోత్సవాన్ని నిర్వహించారు. విజయ దశమిని పురస్కరించుకొని స్వామివారికి అర్చకులు అభిషేకం, ఆకు పూజ, పుష్పాభిషేకం నిర్వహించారు.

-నెట్‌వర్క్ నమస్తే తెలంగాణ, అక్టోబర్ 13

ఖిల్లాఘణపురంలో రావణ దహనకాండ ఏర్పాట్లు చేస్తున్న భక్తులు

ఆత్మకూరులో పూజలు చేస్తున్న చైర్‌పర్సన్ గాయత్రీయాదవ్ దంపతులు

పెబ్బేరులో రావణ దహనానికి ఏర్పాట్లు చేస్తున్న హిందూ జాగృతం సభ్యులు

ఆత్మకూరులో రావణదహనం చేస్తున్న దృశ్యం

కేటీదొడ్డిలో శమీ వృక్షానికి పూజలు చేస్తున్న గ్రామ పెద్దలు

ఎర్రవల్లి : బొల్లుగట్టు ఆంజనేయస్వామి శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

గుండు చెన్నకేశవస్వామి దర్శించుకునేందుకు పోటెత్తిన భక్తులు

అయిజ : గణదళంలో రథోత్సవంపై ఊరేగుతున్న పంచముఖ ఆంజనేయస్వామి

గట్టులో ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో మొలకలను గ్రామంలో ఊరేగిస్తున్న మహిళలు, యువతులు, చిన్నారులు

అమరచింతలో శమీపూజలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ

ఆత్మకూరులో స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

పెద్ద చింతరేవులలో స్వామివారికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

దుర్గామాతకు పూజలు చేసిన మాజీ మంత్రి

వనపర్తి టౌన్, అక్టోబర్ 13 : జిల్లా కేంద్రంలోని యూకో బ్యాంక్ యువత ఆధ్వర్యంలో హనుమాన్ టేకిడీ లో ప్రతిష్ఠించిన దుర్గామాతను శనివారం మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా పట్టణ పార్టీ అధ్యక్షుడు పలుస రమేశ్‌గౌడ్, కౌన్సిలర్ బండారు కృష్ణలను ఆయన అభినందించారు. అనంతరం నిర్వాహకులు మాజీ మంత్రిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ డ్యానియల్, యూకో బ్యాంక్ యువత, మహిళలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

మల్దకల్, అక్టోబర్ 13 : మండలంలోని బిజ్వారంలో దసరా ఉత్సవాలను పురస్కరించుకొని 13మంది పంచాయతీ పారిశుధ్య కార్మికులకు యువకులు శనివారం అమ్మవారి విగ్రహం వద్ద నూతన వస్త్రాలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ మా పనులను గుర్తించి పండుగ పూట కొత్త బట్టలు అందజేయడం సంతోషించదగ్గ విషయన్నారు.

ఎస్‌జీటీగా ఎంపికైన మహిళకు సన్మానం

పాన్‌గల్, అక్టోబర్ 13 : ఇటీవల మండలంలోని కేతేపల్లిలో ఎస్‌జీటీ పోస్టుకు ఎంపికైన కాకం రమాదేవిని ఆదివారం నాయకులు బాలీశ్వర్‌రెడ్డి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డురాదని, పట్టుదల, కృషి సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు స్వామి, ఎల్లయ్య, కోటయ్య, చిన్ననారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రజావాణి రద్దు

వనపర్తి,అక్టోబర్13: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఎంపీ మల్లురవి అధ్యక్షతన సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో ప్రభుత్వ దిశా సమావేశం నిర్వహిస్తున్నందున ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఎర్రవల్లి చౌరస్తా, అక్టోబర్ 13 : రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన ఘటన శనివారం అర్ధరాత్రి ఇటిక్యాల పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు ఎర్రవల్లి పదోపటాలం పెట్రోల్ బంక్ వద్ద కర్నూల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న హార్వెస్టర్‌ను అదే మార్గం నుంచి వెళ్తున్న డీసీఎం వేగంగా వచ్చి ఢీ కొట్టడంతో అనంతపురం జిల్లాకు చెందిన సుధాకర్, నవీన్‌కు గాయాలయ్యాయి. అదే సమయంలో తిమ్మాపూర్ రోడ్డు వద్ద ట్రాఫిక్‌ను నియంత్రణ చేస్తున్న సమయంలో హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును మరో డీసీఎం వెనుక నుంచి ఢీ కొట్టడంతో బస్సులోని మహిళకు గాయాలయ్యాయి. గాయపడిన క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం కర్నూల్ దవాఖానకు తరలించారు.

గ్యాస్ లీకై హోటల్ దగ్ధం

మల్దకల్, అక్టోబర్ 13 : మండలంలోని అమరవాయి గ్రామంలోని బస్టాండ్ వద్ద తెలుగు కృష్ణ హోటల్ పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. కాగా శనివారం హోటల్‌లో గ్యాస్ సిలిండర్ లీక్ కావడంతో అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నది. దీంతో సామగ్రితోపాటు వివిధ వస్తువులు పూర్తిగా కాలిపోయాయి హోటల్‌లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరుగలేదు. ఆస్తి నష్టం రూ.2లక్షల వరకు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

మహిళ పై వేడి నూనెతో దాడి

మానవపాడు,అక్టోబర్13 : ఇంటి ఎదుట బజ్జీల బండి పెట్టడంతో వాసన వస్తోందని మహిళపై వేడి నూనె చల్లి దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం ప్రకారం మండలంలోని చిన్నపోతులపాడు గ్రామానికి చెందిన ఎస్తేరమ్మ రోడ్డు పక్కన బజ్జీల బండి పెట్టుకొని జీవనం సాగిస్తోంది. ఈ నెల 10 తేదీన రోజుమాదిరిగానే ఎస్తేరమ్మ తన బజ్జీల బండిని ఏర్పాటు చేసింది. పక్కింటి వారు అక్కడ బజ్జీల బండిని పెట్టవద్దని ఆమెతో వాదనకు దిగారు. మాట మాట పెరగడంతో బండి దగ్గరకు వచ్చిన యుగంధర్ బండిని తోశాడు. దీంతో అప్పటికే కాగుతున్న నూనె ఎస్తేరమ్మపై పడింది.వెంటనే కుటుంబీకులు ఎస్తేరమ్మను చికిత్సకు తరలించారు. అనంతరం మామ ఏసన్న మానవపాడు పోలీస్‌స్టేషన్‌లో యుగంధర్‌పై ఫిర్యాదు చేశాడు. అదే రోజు రాత్రి 10గంటలకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.13వ తేదీ చిన్న పోతులపాడుకు చేరుకున్న డీఎస్పీ సత్యనారాయణ గ్రామంలో విచారణ చేపట్టారు. వారి వెంట సీఐ టాటా బాబు ఉన్నారు.

స్నేహితురాలికి ఆర్థికసాయం

వడ్డేపల్లి, అక్టోబర్ 13 : తమతో పాటు పదో తరగతి చదువుకున్న చిన్ననాటి స్నేహితురాలికి ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు తోటి మిత్రులు. మండలంలోని కొంకల జెడ్పీహెచ్‌స్ 2006-07లో పదో తరగతి చదువుకున్న కొంకల గ్రామానికి చెందిన నర్సింహులు కూతురు శైలజ భర్త ఇటీవల విద్యుదాఘాతంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తోటి మిత్రులు రూ.60 వేలు జమచేసి ఆమెకు అందజేశారు. కార్యక్రమంలో మిత్రులు, టీచర్ తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడికి ఆర్థిక సాయం అందజేత

మదనాపురం, అక్టోబర్ 13 : మండలంలోని కొన్నూరు గ్రామానికి చెందిన భాజా ఉస్సేన్ 1995-96లో మదనాపురం జెడ్పీహెచ్‌స్‌లో పదో తరగతి చదువుకున్నాడు. అతను కొంతకాలంగా బ్రెన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతూ ఇటీవల ఆపరేషన్ చేయించుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడని తెలుసుకున్న తన స్నేహితులు ఆదివారం కొన్నూరు గ్రామానికి చేరుకొని భాజా ఉస్సేన్‌ను పరామర్శించి రూ.72వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సాయిలు, ఆంజనేయులు, పరశురాములు, శాంతి, శివశంకర్, మహేశ్, మైబు, వెంకటేశ్‌రెడ్డి, చంద్రయ్య, భాజా మైనోద్దీన్, రవీందర్, అశోక్, రషీద్, రాములు, రాంచందర్ నాయక్, రత్నయ్య పాల్గొన్నారు.

కొంకల పాఠశాల వద్ద స్నేహితురాలికి ఆర్థిక సాయం అందజేస్తున్న 2006-07 పదో తరగతి విద్యార్థులు

మూడు ఉద్యోగాలు సాధించిన యువకుడికి సన్మానం

మల్లికార్జున్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఎర్రవల్లి చౌరస్తా, అక్టోబర్ 13 : మండలంలోని బీ.వీరాపురం గ్రామానికి చెందిన మల్లి కార్జున్ జిల్లాలో డీఎస్సీ ఫలితాల్లో మూడు ఉద్యోగాలు సాధించాడు. ఇటీవలే వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో మల్లి కార్జున్ ఎస్ఏ మ్యాస్, ఫిజిక్స్, ఎస్జీటీలో మూడు ఉపాధ్యాయ పోస్టులు సాధించాడు. దీంతో గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు, బంధువులు, మిత్రులు, గ్రామస్తులు దసరా పండుగ రోజు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మల్లి కార్జున్ తనకు సహకరించిన ఉపాధ్యాయులకు, స్నేహితులకు కృతజ్ఞతలు తెలిపాడు.

దాతకు సన్మానం

శ్రీహరిరెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు

పెబ్బేరు, అక్టోబర్ 13 : చదువుకున్న పాఠశాల అభివృద్ధికి రూ. 10లక్షలు విరాళంగా ప్రకటించి దాతృత్వాన్ని చాటుకున్నాడు ఓ ఎన్ఆర్ఐ. పెబ్బేరు మండలం యాపర్ల మాజీ ఎంపీటీసీ సూదిని నరేందర్‌రెడ్డి కుమారుడు శ్రీహరిరెడ్డి అమెరికాలో స్థిరపడ్డాడు. అయితే తాను చదువుకున్న పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించాలని భావించి విరాళం ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు. ఈ డబ్బుతో ఆ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను తీర్చేందుకు ఉపాధ్యాయులు ప్రణాళికలు కూడా సిద్ధం చేశారు. ఇప్పటికే రూ. 3లక్షలు కూడా ఖర్చు పెట్టారు. విద్యార్థులకు బెంచీలు, సైన్సు ల్యాబ్‌లకు వసతులతో పాటు చిన్న చిన్న నిర్మాణాలను కూడా ఈ నిధులతో చేపట్టనున్నారు. పాఠశాలలను తాను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. అదీగాక పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు రెండు వెండి కాయిన్లు ఇప్పటికే ఇచ్చి ప్రోత్సహించారు. ఈ నేపథ్యంలో దసరా పండుగ సదర్భంగా దాత శ్రీహరి రెడ్డిని పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం తరపున ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల పీఆర్‌టీయూ అధ్యక్షుడు చిన్నరాములు, ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, ఉపాధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, శంకర్‌గౌడ్, హుసేన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అమ్మవారి ఊరేగింపులో ఇరువర్గాల తోపులాట

- గుండెపోటుతో యువకుడు మృతి

అమరచింత, అక్టోబర్ 13 : దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించే క్రమంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకున్న ఘటన మండలంలోని మిట్టనం డొల్ల గ్రామంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకున్నది. స్థానికులు కథనం ప్రకారం అమ్మవారి విగ్రహం ఊరేగింపు క్రమంలో డీజే సౌండ్ బాక్స్ విని యోగించడంతో భారీగా శబ్దం వస్తుందని నిర్వాహకులతో స్థానికులు వాదనకు దిగారు. ఈ క్రమంలో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ క్రమంలో కొంతమంది కాంగ్రెస్ నాయకులు మక్తల్ ఎమ్మెల్యే వాకిటిశ్రీహరి దృష్టికి సమస్య తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన ఆయన పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకొని, ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించడంతో గొడవను నిలిపివేశారు. ఈ క్రమంలో పోలీస్‌స్టేషన్ నుంచి ఇంటికి వచ్చిన గంటలోపే ధర్మారెడ్డి (35)అనే యువకుడు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు స్థానిక వైద్యుడు అరవింద్‌ను సంప్రదించగా, ఆయన ఒక మాత్రను ఇచ్చి గుండెపోటు అని ఆత్మకూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా సూచించారు. ధర్మారెడ్డి అక్కడికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. దీంతో పండగ పూట గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్

పాన్‌గల్,అక్టోబర్ 13 : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి కార్యకర్త ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జబ్బార్ అన్నారు. మండలకేంద్రంలో సీపీఎం నాయకులు వెంకటయ్య అధ్యక్షతన మండల కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం మూడో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యలు గాలికి వదిలేసి మతతత్వ రాజకీయాలు చేయడం తప్పా ప్రజా సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ ఆధ్వర్యంలో నవంబర్ 9,10 తేదీల్లో వీపనగండ్ల మండలకేంద్రంలో జిల్లా మూడో మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీ ఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బాల్‌రెడ్డి, కమిటీ సభ్యులు వేణుగోపాల్, మండల కార్యదర్శి బాల్యా నాయక్, నాయకులు రాము, భీమయ్య పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
★ I, Mohammad husamoddin (Old Names) S/o. Mohammad Ekramoddin, R/o.H.No.6-4-101, Street : Arfathpura, Mandal: KORATLA-505326, District Jagtial, Telangana, Have Changed My Name as MOHAMMAD HUSSAM UDDIN
NTK-325721

WANTED
★ B.Sc. Computer Freshers 2022, 2023, 2024 Batch Male Candidates కావలెను. జీతము 17,200+ అలవెన్సులు కలవు. కాంటాక్ట్ నెం: 9848169290.
NT-336728

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748